'పాలిటీ'కి పక్కా వ్యూహం

బి. కృష్ణారెడ్డి,
క్లాస్-1 స్టడీ సర్కిల్
హైదరాబాద్

గ్రూప్-2 గైడెన్స్

గ్రూప్-2 పరీక్షలో పేపర్-2లో భారత రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థ(పాలిటీ)పై 75 మార్కులుంటాయి. అభ్యర్థుల తుది విజయంలో ఈ విభాగం కీలకమైందని అందరికీ తెలిసిందే! అయినా, ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు ఈ అంశాన్ని ఉపేక్షిస్తున్నారు. కారణం- పాలిటీ అనగానే ఈజీగా ఉంటుందనే భావన. ఇందులోని అంశాలు ప్రతిరోజు దినపత్రికలలో, ఇతర మీడియాలో, జనసామాన్యంలో చర్చకు రావడం, ముఖ్య పదవులైన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రిమండలి, గవర్నర్, ముఖ్యమంత్రి, సుప్రీంకోర్టు తదితర అంశాల గురించి పాఠశాల స్థాయి నుంచి సిలబస్‌లో ఉండడం మూలంగా 'సోన్ కంటెంట్' అనే భావనకు గురయి అభ్యర్థులు చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు. ఈమధ్య జరిగిన గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలలో పాలిటీ, చరిత్ర అంశాలుగా ఉన్న పేపర్-2లో అభ్యర్థులందరికీ(టాపర్స్‌తో సహా) మిగతా పేపర్ల కన్నా అందులోనే తక్కువ మార్కులు రావడం గమనార్హం! ఎందువల్ల అలా జరిగింది? సరైన అవగాహన లేకపోవడంతో పాటు 'మాస్ మెంటాలిటీ' అంటే..కొందరు 'ఈజీ' అనే 'టాక్'ను ప్రచారం చేస్తారు. అది కాస్తా 'జనరల్ ఒపీనియన్'గా స్థిర పడిపోతుంది. దీనికి తోడు కొందరు 'ఫాకల్టీ మెంబర్స్' మిడిమిడి జ్ఞానంతో ఇచ్చే గైడెన్స్, కౌన్సిలింగ్ అభ్యర్థులను తప్పుతోవ పట్టించి ఫలితాలు తారుమారు చేస్తున్నాయి. అందువల్ల అభ్యర్థులు జాగ్రత్తగా, వివేచనతో పరీక్షలకు సిద్ధం కావలసి ఉంటుంది. 'నలుగురితో పాటు నారాయణా' అనే 'సేఫ్ రూల్' పోటీ పరీక్షలకు సరిపడదు.

సిలబస్‌పై ఫోకస్ చేయాలి

గ్రూప్-2 పాలిటీ విభాగంలో మొత్తం సిలబస్‌ను అయిదు యూనిట్లుగా విభజించారు. అయితే అన్ని యూనిట్స్ మధ్య అంతర్గత సంబంధం ఉంటుంది. ప్రిపరేషన్ సమగ్రంగా చేయాలి తప్ప యూనిట్ వైజ్ కాదు. ఉదాహరణకు, కేంద్ర న్యాయ వ్యవస్థ ఒక యూనిట్‌లో ఉంటే, రాష్ట్ర స్థాయిలో న్యాయ వ్యవస్థ మరో యూనిట్‌లో ఉండవచ్చు. లేదా జిల్లా స్థాయిలో న్యాయ వ్యవస్థ సిలబస్‌లో లేకపోవచ్చు. అలాగే న్యాయ వ్యవస్థకు అనుబంధమైన, ట్రిబ్యునల్స్, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతుల గురించి సైతం తెలుసుకోవాలి.

పాలిటీలో ప్రతి అంశం సమకాలీనమే!

రాజ్యాంగంలోని మూల సూత్రాలు, వివిధ వ్యవస్థలు, సమకాలీన రాజకీయాల వల్ల ప్రభావితం అవుతాయి. రాజ్యాంగ స్ఫూర్తికి, వాస్తవికతకూ గుణాత్మక తేడా ఉంటోంది. తాజా పరిణామాలు, సుప్రీంకోర్టు తీర్పులు, వ్యాఖ్యానాలు, సవరణలు మొదలైన అంశాల వల్ల ఎన్నో నూతన విషయాలు చేరుతుంటాయి. ఉదా. ఇటీవల ఢిల్లీ హైకోర్టు స్వలింగ సంపర్కుల వివాదంపై ఐపిసి సెక్షన్ 377పై ఇచ్చిన తీర్పు, రాజ్యాంగ నిబంధనలు 19, 21తో ఉన్న సంబంధాన్ని ప్రత్యేక దృష్టితో చదివితే గరిష్ఠ ప్రయోజనం ఉంటుంది.

తేలికైన ప్రశ్నలతో పాటు తెలివిని తేల్చేవీ ఉంటాయి

కొన్ని ప్రశ్నలకు సమాధానాలను గుర్తించడంలో సునిశిత పరిశీలన అవసరం. లేకపోతే పొరపాటు జరుగుతుంది. కింది ప్రశ్న అలాంటిదే! చూడండి.ఉదా 1-

1. కాంగ్రెస్ పార్టీ(ఐ) గుర్తు ఏమిటి?

ఎ) హస్తం బి) మువ్వన్నెల జండా, మధ్య భాగంలో చరఖా సి) పై రెండూ సరైనవే డి) ఏవీ కావు

జవాబు చాలా సులభం అనుకొని వెంటనే 'హస్తం' సరైన జవాబుగా రెండో ఆలోచన లేకుండా గుర్తిస్తారు. అయితే ప్రశ్నలో అడిగింది 'పార్టీ' గుర్తు. మీరు గుర్తించింది 'ఎన్నికల గుర్తు'. కొన్ని రాజకీయ పార్టీలకు పార్టీ గుర్తు, ఎన్నికల గుర్తు వేర్వేరుగా ఉంటాయని గ్రహించాలి. ఉదా2-

కొన్ని ప్రశ్నల విషయంలో అభ్యర్థి అసాధారణ తెలివితేటలు ప్రదర్శించాలి. లోతుగా ఆలోచించాలి. సహజ ప్రతిభ, విచక్షణా శక్తి ఉపయోగించాలి. కేవలం సమాచార పరిజ్ఞానం చాలదు. ఉదా...

1. కింద పేర్కొన్న వారిలో అత్యధిక ఎన్నికల్లో ఓటర్లుగా ఉండేవారు?

ఎ) సాధారణ ఓటరు బి) పార్లమెంట్ సభ్యులు
సి) రాష్ట్ర విధాన సభ సభ్యులు
డి) రాష్ట్ర విధాన పరిషత్ సభ్యులు

జవాబు: 'సి'

వివరణ: రాష్ట్ర విధాన సభ సభ్యులు(ఎన్నికైన వారు) రాష్ట్రపతి, రాజ్యసభ, రాష్ట్ర విధాన పరిషత్ సభ్యులను(1/3 వంతు) ఎన్నుకోవడమే కాకుండా, సాధారణ ఓటర్లుగా లోక్‌సభ, విధానసభ ఎన్నికల్లో ఓటర్లుగా ఉంటారు.

(తరువాయి పచ్చేవారం)

ఇలా గుర్తుంచుకోవచ్చు

ఇండియన్ పాలిటీలో వివిధ ప్రకరణలు, భాగాలు, షెడ్యూళ్లు, కనీస, గరిష్ఠ వయస్సులు, జీతభత్యాలు, తొలగింపులు, వివిధ వ్యవస్థల అధికారాలు, విధులు, సమకాలీన సవరణలు... ఇలా విస్తారమైన సమాచారాన్ని చదివి గుర్తుంచుకోవాలి. ప్రాథమిక సమాచారంపై 35-40 ప్రశ్నలు వస్తున్నాయి. ముఖ్యాంశాలను గుర్తుంచుకోవడానికి పాఠ్యాంశాలను ఒక దానితో మరొకటి అనుసంధానం చేసుకోవాలి. తర్కబద్ధమైన సంబంధాన్ని ఏర్పర్చుకోవాలి. ఉదాహరణకు...

కనీస, గరిష్ఠ వయస్సుల అర్హతకు సంబంధించి ఈ విధానాన్ని పాటించండి-

- కనీస వయస్సు ఉన్న పదవులకు, గరిష్ఠ వయఃపరిమితులు ఉండవు. ఉదా: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, ఎంపి. ఎమ్మెల్యే, ఎంఎల్‌సి.
- అలాగే గరిష్ఠ వయఃపరిమితి ఉన్న పదవులకు కనిష్ఠ వయస్సు ఉండదు. ఉదా: సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు.
- పదవీకాలం ఉన్నా పదవీ విరమణ వయస్సు ఉండదు. ఉదా: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, ఎంపి, ఎమ్మెల్యే, ఎంఎల్‌సి.
- పదవీకాలంతోపాటు పదవీ విరమణ వయస్సు ఉన్న పదవులు. ఉదా: ఎలక్షన్ కమిషనర్లు, కంట్రోలింగ్ అండ్ ఆడిటర్ జనరల్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు.

జాబ్స్ రిమైండర్

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ)

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) దిగువ పేర్కొన్న పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసింది. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎటిసి - 100, ఎలక్ట్రానిక్స్ - 100 పోస్టులు, సివిల్ - 100, ఎల్రక్టికల్ - 100, ఫైర్ సర్వీస్ - 18, అఫీషియల్ లాంగ్వేజ్ - 10) ఖాళీలు ఉన్నాయి.

ఎటిసి పోస్టుకు ఎలక్ట్రానిక్స్/ టెలికమ్యూనికేషన్/ రేడియో ఇంజనీరింగ్/ ఐటి/ ఎలక్ట్రానిక్స్ స్పెషలైజేషన్‌తో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎమ్మెస్సీ ఫిజిక్స్/ మేథ్స్, కంప్యూటర్ సైన్స్ ఉత్తీర్ణులు అర్హులు.

ఎలక్ట్రానిక్స్ పోస్టులకు సంబంధించి ఎలక్ట్రానిక్స్/ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ స్పెషలైజేషన్‌తో ఎల్రక్టికల్ ఇంజనీరింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

సివిల్, ఎల్రక్టికల్ పోస్టులకు సంబంధిత ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఫైర్ సర్వీస్‌కు సంబంధించి డిగ్రీతో గ్రేడ్ ఐఎఫ్ఇ లేదా డివిజినల్ ఆఫీసర్స్ కోర్సు లేదా బిఇ (ఫైర్) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అర్హులు. అఫీషియల్ లాంగ్వేజ్ పోస్టులకు హిందీ లేదా ఇంగ్లిష్‌లో పీజీ ఉండాలి. ఇంగ్లిష్‌లో పీజీ అయితే డిగ్రీలో హిందీ చదివి ఉండాలి. అలాగే ఏదైనా డిసిప్లెయిన్‌లో పీజీ అయితే డిగ్రీలో హిందీ, ఇంగ్లిష్ చదివి ఉండాలి. రెండేళ్ళ అనుభవం తప్పనిసరి.

వయసు ఈ ఏడాది జూలై 1 నాటికి 27 సంవత్సరాలకు లోపు ఉండాలి. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎటిసికి వాయిస్ టెస్ట్ అదనం. ఫైర్ పోస్టులకు ఫిజికల్ మెజర్‌మెంట్ అండ్ ఎండ్యూరెన్స్ టెస్ట్ ఉంటుంది. పరీక్ష ఫీజు రూ.100. ఆ మొత్తానికి న్యూఢిల్లీలో చెల్లే విధంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పేర డిడి తీసుకోవాలి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపుకోవాలి. అందులో తీసుకున్న

అకనాలెడ్జ్‌మెంట్‌కి, డిడి జత చేసి ఆగస్టు 24లోగా హెచ్‌ఆర్ సెల్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాజీవ్ గాంధీ భవన్, సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్, న్యూఢిల్లీ - 110 003 చిరునామాకు పంపుకోవాలి. మరిన్ని వివరాలకు ఆగస్టు 1-7 ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు.

వెబ్‌సైట్: www.aai.aero, www.airportsindia.org.in

సశస్త్ర సీమ బల్

సశస్త్ర సీమ బల్ 468 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రధానం హెడ్ కానిస్టేబుల్ టెలికమ్యూనికేషన్ పోస్టులు 346 ఉన్నాయి. మెట్రిక్‌కు తోడు ఎలక్ట్రానిక్స్‌లో రెండేళ్ళ ఐటిఐ సర్టిఫికెట్ లేదా ఫిజిక్స్, మేథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులుగా ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష పాసై ఉండాలి. వయస్సు 18 - 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి రూ.5200 - రూ.20200 స్కేలుకు తోడు గ్రేడ్ పే కింద రూ.2,400 చెల్లిస్తారు.

హెడ్ కానిస్టేబుల్ (వర్క్‌షాప్) 33 పోస్టులు ఉన్నాయి. మెట్రిక్యులేషన్‌కు తోడు ఆటోమోబైల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా లేదా రెండేళ్ళ కాల వ్యవధిగల నేషనల్ ట్రేడ్ లేదా మోటార్ వెహికల్ సర్టిఫికెట్ ఉండాలి. గ్యారేజ్‌లో కనీసం రెండేళ్ళ అనుభవం ఉండాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వయస్సు 18 - 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి రూ.5200 - రూ.20200 స్కేలుకు తోడు గ్రేడ్ పే కింద రూ.2,400 చెల్లిస్తారు.

ఎఎస్ఐ (లేబ్ టెక్నీషియన్) పోస్టులు 27 ఉన్నాయి. సైన్స్‌తో మెట్రిక్యులేషన్‌కు తోడు మెడికల్ లేబరేటరీ టెక్నాలజీలో డిప్లొమా లేదా సర్టిఫికెట్ పాసై ఉండాలి. కనీసం రెండేళ్ళ అనుభవం ఉండాలి. వయస్సు 20 - 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి రూ.5200 - రూ.20200 స్కేలుకు తోడు గ్రేడ్ పే కింద రూ.2,800 చెల్లిస్తారు.

ఎఎస్ఐ (ఫార్మసిస్ట్) పోస్టులు 18 ఉన్నాయి. మెట్రిక్యులేషన్‌కు తోడు ఫార్మసీలో డిగ్రీ లేదా డిప్లొమా ఉండాలి. రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ అయి ఉండాలి. వయస్సు 20 - 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి రూ.5200 - రూ.20200 స్కేలుకు తోడు గ్రేడ్ పే కింద రూ.2,800 చెల్లిస్తారు.

ఎస్ఐ (టెలికం) పోస్టులు 12 ఉన్నాయి. ఎఎస్ఐ (టెలికాం) పోస్టులు 13 ఉన్నాయి. ఎస్ఐ పోస్టుకు ఎలక్ట్రానిక్స్ లేదా టెలికమ్యూనికేషన్ లేదా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్‌తో డిగ్రీ ఉండాలి. ఎఎస్ఐ పోస్టుకు మెట్రిక్యులేషన్‌కు తోడు ఎలక్ట్రానిక్స్ లేదా టెలికమ్యూనికేషన్‌లో డిప్లొమా పాసై ఉండాలి లేదా కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్‌తో ఇంటర్మీడియెట్ పాసై ఉండాలి. వయస్సు 18 - 25 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్ఐ (టెలికాం) కు రూ.9,300 - రూ.34,800, గ్రేడ్ పే రూ.4200 వర్తింపజేస్తారు. ఎఎస్ఐ (టెలికాం) కు రూ.5200 - రూ.20200 స్కేలుకు తోడు గ్రేడ్ పే కింద రూ.2,800 చెల్లిస్తారు.

ఇవి కాక ఇన్‌స్పెక్టర్ (టెలికం) 1, ఎస్ఐ (టెలికం) 12, ఎస్ఐ (పయోనీర్) 8, హెడ్ కానిస్టేబుల్ (ఎల్రక్టీషియన్) 1, ఎఎస్ఐ (స్టెనో) 9 పోస్టులు ఉన్నాయి.

కనీసం 170 ఎత్తు ఉండాలి. 80 - 85 సెం.మీ ఛాతీ అవసరం. ఎత్తుకు తగ్గట్టు బరువు ఉండాలి. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఇవి కాక అభ్యర్థులంతా వంద మీటర్ల దూరాన్ని పద హారు సెకెండ్లలో పూర్తి చేయగలగాలి. 11 అడుగుల ఎత్తు , 3.6 అడగుల దూరం మూడు ఛాన్స్‌ల్లో పూర్తి చేయాలి. 800 మీటర్ల దూరాన్ని నాలుగు నిమిషాల్లో పూర్తి చేయగలగాలి.

జనరల్, ఒబిసి కేటగిరీల అభ్యర్థులు పరీక్ష ఫీజు కింద రూ.50 చెల్లించాలి. ఆ మొత్తానికి న్యూఢిల్లీలో చెల్లే విధంగా Commandant, 25th (SSB) Bn. Ghitorni, New Delhi పేర డిడి తీసుకోవాలి. నిర్దేశిత నమూనాలో పూర్తి చేసిన దరఖాస్తుకు డిడి, సర్టిఫికెట్ల కాపీలు, ఆరేసి రూపాయల స్టాంపులు అతికించిన రెండు సొంత చిరునామాగల స్లిప్పులు జత చేసి Commandant, 25th (SASTRA SEEMA BAL) Battalion Ghitorni, PO Arjungarh New Delhi - 110 047 చిరునామాకు ఆగస్టు 31లోగా పంపుకోవాలి. మరిన్ని వివరాలకు ఆగస్టు 8 -14 ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు.

వెబ్‌సైట్:www. ssb.nic.in



స్కాలర్‌షిప్



డాక్టర్ కె.ఎస్. కృష్ణన్ రీసెర్చ్ అసోసియేట్‌షిప్

ఆటమిక్ ఎనర్జీ విభాగానికి చెందిన బోర్డ్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ న్యూక్లియర్ సైన్సెస్ - డాక్టర్ కె.ఎస్. కృష్ణన్ రీసెర్చ్ అసోసియేట్‌షిప్ (కెఎస్‌కెఆర్ఎ) 20 వ బ్యాచ్ కోసం నోటిఫికేషన్ విడుదలైంది. దీని కింద రీసెర్చ్ అసోసియేట్లుగా ఎంపికైన అభ్యర్థులు ఆటమిక్ ఎనర్జీకి చెందిన సంస్థల్లో గల ఆర్ అండ్ డి విభాగంలో పనిచేయాల్సి ఉంటుంది. ముంబైలోని బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్, కల్పక్కంలోని ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ ఆటమిక్ రీసెర్చ్, ఇండోర్‌లోని రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, కోల్‌కతాలోని వేరియబుల్ ఎనర్జీ సైక్లోట్రోన్ సెంటర్, ముంబైలోని ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్‌లలో జరుగుతున్న పరిశోధనల్లో పాలుపంచుకోవాలి.

ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.20,000 స్టయిపెండ్‌గా చెల్లిస్తారు. ఇతర ప్రయోజనాలూ ఉంటాయి. రెండేళ్ళ వరకు ఈ స్కాలర్‌షిప్ మంజూరు చేస్తారు. పనితీరు సంతృప్తికరంగా ఉంటే, రెండో ఏడాది కాలంలో ఎప్పుడైనా వీరిని సైంటిఫిక్ ఆఫీసర్/ ఇంజనీర్ డి/ఇ గా తీసుకునే అవకాశం ఉంటుంది. రూ.15,600 - రూ.39,100 స్కేలు నాలుగు వరకు అడ్వాన్స్ ఇంక్రిమెంట్లతో వర్తింపజేస్తారు. గ్రేడ్ పే కింద మరో రూ.6,600 చెల్లిస్తారు. ఇంజనీరింగ్‌లోని అన్ని బ్రాంచీలకుతోడు ఫిజికల్, కెమికల్, బయో సైన్సెస్‌లో అవకాశాలు ఉన్నాయి. పిహెచ్‌డి అవసరం. ఇప్పటికే థీసిస్ సమర్పించిన వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జనవరి 1 నాటికి అభ్యర్థి వయస్సు 32 సంవత్సరాలకు మించకూడదు.

షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూ కోసం ముంబైకి పిలుస్తారు. ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఫీజు రూ.100. ఆ మొత్తానికి ముంబైలో చెల్లే విధంగా అకౌంట్స్ ఆఫీసర్, బిఎఆర్‌సి పేర డిడి/ పోస్టల్ ఆర్డర్ తీసుకోవాలి. నీట్‌గా టైప్ చేసిన దరఖాస్తుకు ఫొటో, డిడి జతచేసి సెప్టెంబర్ 1లోగా అక్నాలెడ్జ్‌మెంట్‌తో రిజిస్టర్డ్ పోస్టులో డిప్యూటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసర్ (ఆర్-4), ఫోర్త్ ఫ్లోర్, సెంట్రల్ కాంప్లెక్స్, బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్, ట్రాంబే, ముంబై - 400 085 చిరునామాకు పంపుకోవాలి.మరిన్ని వివరాలకు ఆగస్టు 1-7 ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు.

వెబ్‌సైట్: www.barc.ernet.in/webpages/brns/brns_fellowship.html

బోధన పద్ధతులు మెరుగవ్వాలి

ఎస్‌సిఇఆర్‌టి మొదలు అనేక స్వచ్ఛంధ సంస్థలు జరిపిన పలు పరిశోధనలు దేశంలో ప్రాథమిక విద్య బలహీనంగా ఉన్నట్లు తేల్చాయి. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్య దుర్భరంగా ఉంది! ఒక సర్వే ప్రకారం దేశంలో 23వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. సర్వే ప్రధానంగా 3R's (Reading, Writing, Arithmetic) పై జరిపారు. చదవడం, రాయడం, లెక్కలు చేయడం (అంక గణితం)లో మన పిల్లలు బాగా వెనుకబడి ఉన్నట్లుగా పరిశోధనలు నిరూపించాయి.

మరి ఈ స్థితిని మెరుగుపర్చడానికి ప్రభుత్వం ఏవైనా చర్యలు చేపట్టిందా అని ప్రశ్నించుకుంటే సమాధానం కోసం వెతుక్కోవలసిందే! ప్రాథమిక విద్యలో మన పిల్లలు వెనుకబడటానికి గల ప్రధాన కారణాలను విశ్లేషించుకొని సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టకపోతే పరిస్థితులు మరింతగా దిగజారే ప్రమాదం ఉంది.

ప్రాథమిక విద్య పటిష్ఠమై మన పిల్లలు 3R's లో మంచి పరిజ్ఞానం సంపాదించాలంటే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాల్సింది 'ఉపాధ్యాయుడి పాత్ర' పైనే! ఉపాధ్యాయులు సరిగా చెప్పనందునే మన పిల్లలు వెనుకబడి ఉంటున్నారని నిందించడం సమంజసం కాదు. అది సమస్యకు పరిష్కారం కూడా కాదు. 3R's లో పటిష్ఠమైన పరిజ్ఞానం అందించేలా ఉపాధ్యాయులను ఎంతమేరకు సమర్థంగా తయారుచేశాం? అనునిత్యం బోధనాభ్యసన ప్రక్రియలో వారు ఎదుర్కొంటున్న సమస్యలకు ఏమేరకు పరిష్కారాలను చూపగలుగుతున్నాం? అనే అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.

ప్రస్తుతం ప్రాథమిక విద్యలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అర్హతలు, సబ్జెక్టు పరిజ్ఞానం అందరిలో సమానంగా లేదు. ఇంటర్ చదివి రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డిఇడి) చేసినవారు కొందరైతే, డిగ్రీ/పీజీ చదివి డిఇడి చేసినవారు మరికొందరు. ఇక ఒక సంవత్సరం ఉపాధ్యాయ శిక్షణ (బిఇడి) చేసినవారిలో కొందరు డిగ్రీ అర్హతతో ఉంటే మరికొందరు పీజీ కలిగి ఉన్నారు. ఇంకా ఉన్నత చదువులు (ఎంఫిల్, పిహెచ్‌డి) కలిగినవారు కూడా కొందరు కనిపిస్తారు. వీరికి తోడు విద్యా వాలంటీర్లు కూడా పనిచేస్తున్నారు.

ఇలా విభిన్న అకడమిక్ అర్హతలు కలిగి ఉండటం వల్ల వీరందరికీ ఒకేరకమైన 'డైరెక్షన్' (దిశా నిర్దేశం) చేయలేకపోతున్నాం. అర్హతల్లోని వైరుధ్యాలు పనితీరును ప్రభావితం చేస్తున్నాయి. ఉన్నతమైన అర్హతలు కలిగినవారు ప్రాథమిక విద్య బోధనపై అంతగా ఆసక్తి చూపడం లేదని పరిశీలకుల అభిప్రాయం. అంతంతమాత్రం అర్హతలు కలిగినవారు బోధనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రాథమిక స్థాయిలో కొంతకాలం పనిచేసిన తరవాత ఉన్నత పాఠశాలలకు ప్రమోషన్లు ఇచ్చే ప్రస్తుత విధానం వల్ల ఎక్కువ అర్హతలు కలిగినవారు ఎలాగూ తాము ప్రాథమికస్థాయిలో ఎక్కువకాలం పనిచేయమనే నిర్లిప్త భావనతో ఉంటున్నారని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఇక శిక్షణలోనూ లోపాలు కొట్టవచ్చినట్లుగా కనిపిస్తున్నాయి. డిఇడి/బిఇడిలలో ఇస్తున్న శిక్షణ ప్రాథమిక స్థాయిలో బోధన అనే అంశాల్లో కొన్ని వైరుధ్యాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. శిక్షణకాలంలో 'టీచింగ్ ప్రాక్టీస్' జరిగే పాఠశాలల వాతావరణం వేరు. తరవాతి కాలంలో టీచర్లు పనిచేయాల్సిన పాఠశాలల ప్రాంతాల్లో, గిరిజన తండాల్లో 'టీచింగ్ ప్రాక్టీస్' అనేది జరగకపోవడం వల్ల అలాంటి ప్రదేశాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు సరైన రీతిలో శిక్షణ అందడం లేదనేది స్పష్టమవుతున్నది.

పర్యవేక్షకులు ప్రాథమిక పాఠశాలలకు వెళ్లినప్పుడు ప్రధానంగా పాలనాపరమైన అంశాలపైనే దృష్టిపెడుతున్నారు అంతేగాని, అకడమిక్‌పరంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సాధక బాధకాలు గుర్తించి వాటిని అధిగమించడానికి అవసరమైన తోడ్పాటును అందించలేకపోతున్నారు. ప్రాథమిక విద్య విషయంలో ఎస్‌సిఇఆర్‌టి, డైట్, ఎస్ఎస్‌సిలు ఆశించిన స్థాయిలో సమన్వయంతో పనిచేయడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇక ప్రాథమిక విద్యపై ప్రధానంగా దృష్టిపెట్టి పరిశోధనలు జరిపే ఒక సంస్థ రాష్ట్రస్థాయిలో గాని దేశస్థాయిలో గాని లేకపోవడం కూడా ఒక ప్రధాన లోపమనే చెప్పాలి.

ఈ లోటుపాట్లను సరిదిద్దడానికి ప్రభుత్వం క్రమపద్ధతిలో చర్యలు చేపట్టాల్సిన అవసరమున్నది. ఇందులో ప్రధానమైంది ఉపాధ్యాయుల సమర్థతను వెలికితీయడానికి తగిన తోడ్పాటు అందించాలి. సబ్జెక్టు పరిజ్ఞానం (కంటెంట్)పరంగా అందరు ఉపాధ్యాయుల్లో 'ఒకస్థాయి'ని నిర్దేశించుకొని, అందుకనుగుణంగా శిక్షణకాలంలోనూ సబ్జెక్టు పరిజ్ఞానాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. ప్రాథమికస్థాయిలో 'సీనియర్ టీచర్లు' పనిచేసేలా ప్రమోషన్ల విధానంలో మార్పులు జరిగితే మంచిదని కొందరి అభిప్రాయం. ప్రాథమిక స్థాయిలో కొంతకాలం పనిచేసిన తరవాత ఉన్నత పాఠశాలలకు ప్రమోషన్లు ఇస్తున్న ప్రస్తుత విధానంలో కొన్ని మార్పులు చేసి 'పోస్టు' అప్‌గ్రేడ్ చేయడం వల్ల ప్రాథమిక స్థాయి సబ్జెక్టు కంటెంట్ బోధనలో మంచి నైపుణ్యం కలిగిన సీనియర్ టీచర్లు ప్రాథమిక స్థాయిలో ఉండేలా చూడవచ్చు.

శిక్షణ కాలంలో మారుమూల ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో కూడా టీచింగ్ ప్రాక్టీస్ జరిగేలా చర్యలు చేపడితే, వృత్తిలో ప్రవేశించిన తరవాత వారు బాగా రాణించే అవకాశమున్నది. శిక్షణ కాలంలోనే ఇటువంటి ప్రాంతాల పాఠశాలలపై వారికి మంచి అవగాహన ఏర్పడుతుంది. ఇక పర్యవేక్షకులు ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణకు వెళ్లినప్పుడు పాలనాపరమైన అంశాలతోపాటు అకడమిక్‌పరంగా ఉండే లోటుపాట్లు గుర్తించి వాటిని సరిదిద్దేలా ఉపాధ్యాయులకు సాయపడేలా వీరికి శిక్షణ ఇవ్వాలి.

అలాగే ప్రాథమిక విద్యపై ప్రత్యేకంగా పరిశోధన కోసం ఒక సంస్థను ఏర్పాటుచేసి 3R's లు సమర్థంగా, తక్కువకాలంలో బోధించే పద్ధతులపై పరిశోధనలు జరగాలి. ఇలా ప్రభుత్వం కొన్ని చర్యలైనా చేపడితే ప్రాథమిక విద్య తప్పకుండా పటిష్ఠమవుతుంది. దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యలో మంచిస్థాయిని పొందగలుగుతుంది. మన పిల్లలు ప్రాథమిక విద్యలో పటిష్ఠమైన పునాదితో ఉన్నత పాఠశాలలోనే గాక భావిజీవితంలోనూ విద్యలో బాగా రాణించగలుగుతారు.

> ప్రాథమిక విద్యపై ప్రత్యేకంగా పరిశోధన కోసం ఒక సంస్థను ఏర్పాటుచేసి 3R's లు సమర్థంగా, తక్కువకాలంలో బోధించే పద్ధతులపై పరిశోధనలు జరగాలి. ఇలా ప్రభుత్వం కొన్ని చర్యలైనా చేపడితే ప్రాథమిక విద్య తప్పకుండా పటిష్ఠమవుతుంది. దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యలో మంచిస్థాయిని పొందగలుగుతుంది.

చుక్కాని



చుక్కా రామయ్య